క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

మూసాపేట: భరత్‌నగర్‌లోని పోచమ్మ గ్రౌండ్‌లో వైఎస్సార్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఉంటుందని దేవిరెడ్డి మనోహర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు కేక్ కటింగ్ తర్వాత అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

కూకట్‌పల్లి: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్. రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని శనివారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్ అభిమాన సంఘం నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

10న భవిష్య నిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయంలో భవిష్య నిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా. హేమంత్ తెలిపారు. ఈనెల 10వ తేదీన ఉదయం 10గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్‌స్టాండ్‌లోని రెండో అంతస్తులో గల పీఎఫ్ కార్యాయలంలో ఉంటుందన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవటమే కాకుండా తగిన సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 సమస్యలను పరిష్కరిస్తా

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లో డ్రైనేజీ, రోడ్లకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన శుక్రవారం ఆల్విన్ కాలనీ ఫేజ్-2లో పాదయాత్ర చేసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఒక వీధిలో డ్రైనేజీ లైన్, సీసీరోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో నిర్మాణ పనులు చేపట్టే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు స్పందన

మోతీనగర్: వస్త్రధారణతోనే మనిషికి గుర్తింపు ఉంటుందని కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శన నిర్వాహకులు సంజయ్ జైన్, వినోద్ జైన్ పేర్కొన్నారు. కొన్ని రోజులు నుంచి మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఆషాఢమాసం సందర్భంగా డిస్కౌంట్ సేల్‌తో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత కళా ప్రదర్శనలో దేశంలోని వివిధ రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు 10.30 నుంచి రాత్రి 9.30గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

మరమ్మతులతో సరిపెట్టొచ్చు..

కానీ పూర్తిగా ధ్వంసం చేశారు.!

- పార్కు ప్రహరీని కూల్చి తిరిగి నిర్మిస్తున్న వైనం
- ప్రజాధనం వృథా చేస్తున్నారంటున్న స్థానికులు


భరత్‌నగర్ పార్కువద్ద నేలమట్టం చేసిన పార్కు ప్రహరీ



మూసాపేట: కాంట్రాక్టర్లు పనులు కావాలి... అధికారులకు కమీషన్లు కావాలి... ప్రజాధనం ఎలా వాడుకున్నా అడిగే వారే లేరు. మంచిగా ఉన్న వాటిని పగులగొట్టి టెండర్లు వేసి నిధులు మంజూరు చేసి మళ్లీ నిర్మాణం చేపడుతున్నారు. మరమ్మతులు చేస్తే సరిపోయే దానికి పూర్తిగా నేలమట్టం చేసి తిరిగి నిర్మాణం చేస్తుండటంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రజాధనం మరో చోట ఉపయోగిస్తే బాగుంటుంది కదా. ఎందుకు వృథా చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఫతేనగర్ డివిజన్‌లోని భరత్‌నగర్ కాలనీ స్కూల్ గ్రౌండ్‌లోని ముందు భాగంలోని పార్కు ప్రహరీ కూల్చి తిరిగి నిర్మాణం చేపడుతున్నారు.

- భరత్‌నగర్ కాలనీలోని స్కూల్ గ్రౌండ్ ముందు పార్కు ప్రహరీని 13 సంవత్సరాల క్రితం నిర్మించారు. ఇప్పటికీ చిన్న చిన్న పగుళ్లు తప్ప పడిపోయే పరిస్థితి లేదు.
- పార్కు ప్రహరీయే కాకుండా స్కూల్ గ్రౌండ్ ప్రహరీ కూడా అదే సమయంలో నిర్మించారు. ఈ ప్రహరీ కూడా మంచిగానే ఉంది. కానీ పార్కు ప్రహరీని మాత్రం రోజు రోజుకు కొద్దికొద్దిగా కూలగొట్టి పూర్తిగా ధ్వంసం చేశారు.
- సుమారు 45లక్షల రూపాయల నిధులను కేటాయించి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడ పార్కు గేటు కూడా ఇటీవలనే ఏర్పాటు చేశారు. కనీసం గేటు నిర్మించే సమయంలోనైనా ప్రహరీకి మరమ్మతులు చేసి ఉంటే సరిపోయేది. వాటికి ఇప్పుడు లక్షల రూపాయలను కేటాయించి నిర్మాణం చేస్తున్నారు.
- అంతేకాకుండా మరికొద్ది రోజులు పక్కనే ఉన్న పోచమ్మ గ్రౌండ్ ప్రహరీని కూడా నేలమట్టం చేసి తిరిగి నిర్మిస్తారని స్థానికులు పేర్కొంటున్నారు.
- ఇటీవల ఇదే కాలనీలోని ఈడబ్ల్యూఎస్ వద్ద ఉన్న రాయలసీమ గ్రౌండ్‌లో ప్రహరీకి మరమ్మతులు చేసి పైన ఎత్తు పెంచి ఆకర్షణీయమైన బొమ్మలను తీర్చిదిద్ది అందంగా ముస్తాబు చేశారు.
- పార్కు గోడకు పగుళ్లు ఉంటే మరమ్మతులు చేయాలే కానీ లక్షల రూపాయలు వెచ్చించి బూడిదలో పోసిన పన్నీరులా చేయటం ఎందుకని స్థానిక ప్రజలు వాపోతున్నారు.
- ఇవే నిధులు రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, ఇతర అవసరాలకు ఉపయోగించినా బాగుండేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

24 హాస్టళ్లు సీజ్

- కొరడా ఝుళిపించిన ఏఎంహెచ్‌ఓ మమత
- వంట గదులు అపరిశుభ్రంగా ఉన్నాయంటూ ఆగ్రహం
- హాస్టల్ నిర్వాహకుల తీరుపై ఎమ్మెల్యేకు స్థానికుల ఫిర్యాదు


తనిఖీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు


ఓ హాస్టల్‌ను సీజ్ చేస్తున్న అధికారులు, సిబ్బంది

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పరిధిలోని హాస్టళ్లలో శుక్రవారం అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి కొరడా ఝుళిపించారు. గురు, శుక్రవారాల్లో కూకట్‌పల్లిలోని ఇళ్ల మధ్యలో ఉన్న 24 హాస్టల్స్‌లో కూకట్‌పల్లి ఏఎంహెచ్‌ఓ మమత ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బంది, అధికారులతో కలిసి హాస్టళ్లలోని వసతులను పరిశీలించారు. నిబంధనలు పాటించకుండా అపరిశుభ్ర వాతావరణంలో హాస్టళ్లను కొనసాగిస్తున్నారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.
మరోవైపు మహిళా, పురుషుల హాస్టల్స్ ఎక్కువగా ఉన్నాయని శాంతి భద్రతల సమస్య తలెత్తుతుండటంతో తమకు ఫిర్యాదులు వచ్చాయని ఏఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. ఈ మేరకు కూకట్‌పల్లిలోని సుమారు 24 హాస్టళ్లను సీజ్ చేశామని తెలిపారు. ఇటీవల హాస్టళ్లు ఎక్కువగా ఉండటంతో తమకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కూడా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తనిఖీలు చేశామని తెలిపారు. ఇదే తరహాలో మిగతా హాస్టళ్లపై కూడా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.

వార్డు పరిపాలన వ్యవస్థపై అవగాహన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానంద వార్డు కార్యాలయంలో శుక్రవారం కార్పొరేటర్ సబిహా బేగం, డిప్యూటీ కమిషనర్ రవికుమార్, డివిజన్ బస్తీ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ రవికుమార్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వార్డు పరిపాలన వ్యవస్థను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు లింగాల ఐలయ్య, వీరారెడ్డి, పార్వతమ్మ, సత్యం, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్డు పనుల పరిశీలన

బాలానగర్: బాలానగర్ డివిజన్ అభివృద్ధి పనుల్లో భాగంగా శుక్రవారం డి. సంజీవయ్య కాలనీలో జరుగుతున్నటువంటి వీడీసీసీ రోడ్డు పనులను బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, సత్యనారాయణ, అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి


సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత ఐక్య వేదిక నాయకులు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుటల సంస్థ చైర్మన్ సాయిచంద్ అకాల మరణానికి చింతిస్తూ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దళితుల ఐక్యవేదిక నాయకులు ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కూకట్‌పల్లి వై-జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్క పెంటయ్య, బోడ నర్సింగ్‌రావు, సింగూరి పాండు, నపారి చంద్రశేఖర్, ఎడ్ల సదానంద్, యాదయ్య, ఎడ్ల ప్రభాకర్, ఎస్‌పి. లక్ష్మణ్, టెంపుల్ సత్యనారాయణ, కర్క రవిందర్, జినుగు పుల్లారావు, మహంకాళి సూరి, బచ్చలి పాండు, బేగరి నర్సింహా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా ఎదగాలి

మూసాపేట: మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా ఎదగాలని.. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీష బాబూరావు అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ ధనలక్ష్మి సెంటర్‌లో ఖార్డ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మెషిన్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఎంతోమంది మహిళలకు కుట్టు మెషిన్లు అందించారన్నారు. పలు ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలను నిర్వహించి వారికి ఉపాధి కల్పించారని తెలిపారు. మహిళలు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. స్థానిక నాయకులు, ఖార్డ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభను విజయవంతం చేద్దాం

- కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు


పార్టీ కార్యాలయంలో ప్రధాని పర్యటన వివరాలు తెలియజేస్తున్న మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ఈనెల 8న వరంగల్‌కు వస్తున్న భారత ప్రధాన మంత్రి మోదీకి ఘనస్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు తరలి రావాలని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రైల్వే వ్యాగన్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించడానికి రానుండటం సంతోషకరమన్నారు. ఈ వ్యాగన్ ఫ్యాక్టరీ ద్వారా రోజుకు ఏడు గూడ్స్ బోగీల ఉత్పత్తి జరుగుతుందన్నారు.
– అక్కడి నుంచి భద్రకాళీ ఆలయం, ఆర్ట్స్ కళాశాలకు వస్తారన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యరావు, సూర్యప్రకాష్, వడ్డేపల్లి రాజేశ్వరరావు, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఇప్పటి వరకు ఎంతమందికి 'డబుల్' ఇళ్లు ఇచ్చారు?

- కైత్లాపూర్ డబుల్ ఇళ్ల పరిశీలనకు వెళ్లిన కాంగ్రెస్
- అడ్డుకున్న పోలీసులు.. ధర్నాకు దిగిన నేతలు

మూసాపేట: కైత్లాపూర్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పరిశీలించారు. పోలీసులు కాంగ్రెస్ నాయకులను లోపలకు వెళ్లకుండా అడ్డుకోవటంతో వారు అక్కడే బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం వారు డబుల్ ఇళ్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ... డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని తొమ్మిదేళ్ల నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో డబుల్ ఇళ్లు ఇస్తున్నామని ప్రచారం చేస్తూ, ఎన్నికల సమయం ముగిశాక వాటి గురించి మర్చిపోతున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు ఎంతమందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందాయని వారు ప్రశ్నించారు.

- కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణం జరిగినప్పటికి ఇళ్లను కేటాయించటంలో అవకతవకలు జరిగాయని వారు ఆరోపించారు. ప్రజలు మధ్య పెట్టే నాయకులను కాకుండా ప్రజలకు సేవ చేస్తూ వారి సంక్షేమం కోసం పాటు పడే వారిని ఎన్నుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గృహకల్ప వంటి ఎన్నో గృహాలు నిర్మించి పేదలకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీపీసీసీ రాష్ట అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, మల్కాజ్‌గిరి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మోయిజ్, నాయకులు నాగిరెడ్డి, వేణు, పుష్ప, కృష్ణ, అరవింద్, ప్రవీణ్, జుబేద్, రవి, అక్బర్ పాల్గొన్నారు.


కైత్లాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు